17వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
గురువారం | 11 జులై 2024 | పేజీలు 8

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఎమ్మెల్యే ఆరణి స్వాగతం



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

రెండు రోజుల తిరుమల పర్యటనకు వచ్చిన కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి హెూదాలో తొలిసారి బుధవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయంకు చేరుకున్న బండిసంజయ్‌కు ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యే తో పాటు ఆరణి శివ కుమార్, ఆరణి మదన్, బిజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు భాను ప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్‌లు బండి సంజయ్‌కు స్వాగతం పలికారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

**చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సరికొత్త కార్యక్రమం**

**ప్రతి గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే 98499 07885, ఉదయం 10 నుంచి 11 వరకు**

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:**



ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా ప్రతి గురువారం "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య చిత్తూరు నగరపాలక కార్యాలయంలో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొని ఫోన్ ద్వారా సమస్యలను స్వీకరిస్తారు. ప్రజల నుంచి అందిన సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమానికి చిత్తూరు నగర పాలక సంస్థ, చిత్తూరు రూరల్, అర్బన్, గుడిపాల మండలాల అధికారులు హాజరుకానున్నారు. చిత్తూరు నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడానికి ప్రతి గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య 9849907885 నెంబరుకు ఫోన్ చేయవచ్చునన్నారు.

# కన్నుపడిందా... కబ్జానే



**కోట్లల్లో విలువైన భూమిని కబ్జా చేశారు**

**ప్రభుత్వం మారితే మాకేమీ....?**

**రెవెన్యూ పత్రాలతో మాకేంటి మా మాటే చెల్లుబాటు**

**రేణిగుంట, మేజర్‌న్యూస్:**

రేణిగుంట అనే పేరు విన పడితే అందరికీ ముందుగా గుర్తొచ్చేది తిరుపతి అంతర్జాతీయ విమానా శ్రయం. ఇప్పుడు ఆ పేరు కాకుండా మరో నూతన పేరు ఉమ్మడి తిరుపతి జిల్లాల వ్యాప్తంగా భారీగా చెక్కర్లు కొడుతోంది. ఏంటా నూతన పేరు అనుకుంటున్నారా...? భూ కబ్జాలకు కేంద్రం అన్న పేరు. వివరాల్లోకెళ్తే తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి అతి సమీపంలో ఉన్న రేణిగుంట మండలం పాపానాయుడుపేట మండల సరిహద్దు ప్రాంతమైనటువంటి కొత్తపాలెం ప్రాంతంలో విచ్చలవిడిగా ప్రభుత్వ డీకేటి భూములు వాగు పొరంబోకు భూములు భూ కబ్జాల పేరుతో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వినపడేలా మారుమోగుతుంది. ఈ ప్రాంతంలో కొత్తపాలెం లెక్కలకు 187-11లో నాలుగెకరాల ఆరు సెంట్లు , 188-1లో ఒక ఎకరా ఆరు సెంట్లు, భారీ విలువైన భూములపై స్థానికంగా ఖద్దర్ చొక్కా పెద్ద మనిషి చుట్టూ చెలామణి అవుతున్న ఘటన ఈ ప్రాంతంలో చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న ఈ నాయకుడు ఇక్కడ ఉన్న భూములపై కన్నేశాడు. ఈయన గారి కంటి చూపుకు స్థానికంగా ఉన్న ఓ మండల రెవెన్యూ అధికారి సహాయ సహకారాలు అందిస్తూ ఆయన భూఅక్రమంలో అడ్డుకట్టుగా నిలబడుతూ వ్యవహరిస్తున్నాడని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గత నాలుగు నెలలుగా

మిగతా 2లో

# చిత్తూరు జిల్లా ప్రతిష్ఠ పెరిగేలా జిల్లా అభివృద్ధికి అందరూ కలసి పని చేద్దాం

**చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు**

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:**



చిత్తూరు జిల్లా ప్రతిష్ఠ పెరిగేలా జిల్లా అభివృద్ధికి అందరూ కలసి పని చేద్దామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో చిత్తూరు పార్లమెంటుసభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు సంబంధించిన అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చిత్తూరు పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఎంపీ ల్యాండ్స్ ద్వారా మంజూరఅయ్యే పనులను నాణ్యత పూర్తి చేయాలని, ఇందుకు సంబంధించిన విధి విధానాలను తప్పక పాటించాలన్నారు. ప్రభుత్వం ద్వారా ఖర్చు చేసే ప్రతి పైసా పేదలకు చెందేలాపాలన అందించేందుకు కృషి చేయాలని జిల్లా ప్రతిష్ఠను ఇనుమడింప చేసేలా జిల్లా అధికారులు బాధ్యతా యుతంగా పనిచేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడు తూ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నిధులతో అమలవుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జలజీవన్ మిషన్, నేషనల్ హెల్త్ మిషన్, అమృత్ సరోవర్‌లతో పాటు వివిధ సంబంధిత శాఖల ద్వారా అమలవుతున్న పథకాలకు సంబంధించిన వివరాలను చిత్తూరు పార్లమెంటు సభ్యులకు

మిగతా 2లో

# ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పిలుపు**



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** కుటుంబ సంక్షేమ, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు గురువారం నిర్వహించే ప్రపంచ జనాభా అవగాహన దినోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో కుటుంబసంక్షేమ, ఆరోగ్య శాఖ, నేషనల్ హెల్త్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ బ్యానర్, పోస్టర్లను జిల్లా కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.శ్రీహరి, ఇతర వైద్య సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు కుటుంబ నియంత్రణ, ప్రజల ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పాఠశాలలు, కాలేజీల్లో యువతకు ప్రణాళిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం కుటుంబ ప్రణాళిక అనేది ఉండాలని సూచించారు. కుటుంబ ప్రణాళిక అనేదిఅభివృద్ధి చెందుతున్న భారతదేశానికి గుర్తింపు దంపతులకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసరావు, జిల్లా ఎపిడమాలజిస్ట్ లావణ్య, ఆశాలు, ఎంఎల్హెచ్‌పీలు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గూడూరు ఎమ్మెల్యేకు అభిమాన నీరాజనం

**అశ్వాలు, గజమాలలు, తప్పెట్లు, తాళాలు, డీజే, బాణాసంచా వేడుకలతో మిన్నంటిన సంబరం**

**అసెంబ్లీ ఎన్నికల్లో రెండోసారి అఖండ మెజారిటీతో విజయం సాధించిన గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ బుధవారం మొట్టమొదటిసారిగా చిట్టమూరుకు విచ్చేశారు. తేదేపా చిట్టమూరు మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు.**

8లో

# ప్రజలకు పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయండి

## ప్రతిరోజూ నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించండి... కమిషనర్ అదితి సింగ్

**తిరుపతి మున్సిపాల్టీ, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరంలో అన్ని ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా బుధవారం మంగళం,అలిపిరి వద్ద గల వాటర్ ఫిల్టర్ ప్లాంట్ లను, మునిసిపల్ పార్కు, లీలా మహల్ సమీపంలో గల నీటి సరఫరా ట్యాంకులను ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. కళ్యాణి డ్యాం నుండి నీటి పంపింగ్ చేసి ఫిల్టర్ చేసి, ట్యాంకులను సరఫరా చేసే విధానాన్ని, అక్కడ నుండి నగరంలో నీటి సరఫరా విధానాన్ని ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్ కు వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజూ నీటి సాంద్రత పరీక్షలు తప్పకుండా నిర్వహించాలని అన్నారు. అలాగే అన్ని ట్యాంకులను నిర్ణీత సమయంలో శుభ్రం చేసి నీటిని నింపి సరఫరా చేయాలన్నారు. వీటన్నింటిని కూడా రికార్డ్ చేయాలని అన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యం లో ఎక్కడా కూడా నీరు కలుషితం కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యం గా తాగునీరు సరఫరా అయ్యే పైప్ లైన్ పక్కన డ్రెయినేజీ కాలువలు, పైప్ లైన్ లేకుండా చూడాలన్నారు. ట్యాంకుల్లో క్లోరినేషన్ సక్రమంగా జరిగేలా అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది, నీటి సరఫరా చేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఒకనిర్ణీత సమయంలో నగరంలో నీటి సరఫరా జరిగేలా చూడాలని అన్నారు. ఎక్కడైనా ప్రజలకు నీరు సకాలంలో సరఫరా కాలేదని తన దృష్టికి వస్తే అక్కడి అధికారులు, సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, డీఈలు శ్రావణి, తేజస్విని ఉన్నారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

## ఏర్పేడు తహసీల్దార్ ఉదయ్ భాస్కర్ రాజు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు అని ఏర్పేడు తహసిల్దార్ ఉదయ భాస్కర్ రాజు హెచ్చరించారు. మర్రి మంద ఇందిరమ్మ పట్టాలు ఇచ్చి ఉన్న స్థలంలో భవిష్యత్తు అవసరాల కోసం ఉంచిన స్థలంలో డంపింగ్ యార్డు వున్న స్థలంలో మండలంలో వికృతి మాల రెవెన్యూలో 132/133లలో ఎకరా భూమిని పలువురు ఆక్రమించే ప్రయత్నం చేయడంతో రెవెన్యూ అధికారులు సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవు అని తహసిల్దార్ ఉదయ భాస్కర్ రాజు హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో రాజశేఖర్,, ఆర్ఐ నల్లయ్య, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



# చిత్తూరు జిల్లా ప్రతిష్ట పెరిగేలా జిల్లా అభివృద్ధికి అందరూ కలసి పని చేద్దాం

(మొదటిపేజీ తరువాయి)

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి ఎన్.రాజశేఖర్, ఇరిగేషన్, పిఆర్, ఆర్‌డబ్ల్యూ ఎస్, ఆర్ అండ్‌బి, ఎస్ఈలు విజయ్ కుమార్ రెడ్డి,చంద్ర శేఖర్ రెడ్డి,ఉమా మహేశ్వర రెడ్డి, విజయ్ కుమార్, జడ్పీ సీఈఓ గ్లోరియా, హౌసింగ్, డిఆర్డిఏ, మెప్మా పీడీలు పద్మనాభం, తులసి, రాధమ్మ, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ, డిపిఓ లక్ష్మి, సిపిఓ సాంబశివా రెడ్డి, సాంఘిక సంక్షేమ,బిసి సంక్షేమ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖల అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బానీ భాష, శ్రీనివాస్, వ్యవసాయ, ఉద్యాన వన, ఎపిఎంఐపి శాఖల అధికారులు మురళీ కృష్ణ, మధుసూదన్ రెడ్డి, బాల సుబ్రహ్మణ్యం, డిఎల్‌డిఓ రవి కుమార్, ఈఈ టిడ్కో వెంకటముని, డిఈఓ దేవరాజులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కన్ను పడిందా... కబ్జానే

(మొదటిపేజీ తరువాయి)

రెవెన్యూ అధికారులు ఎన్నికల హడావిడిలో పూర్తిస్థాయిలో లీనమై ఉండటంతో ఇదే అదునుగా చూసుకొని మండల రెవెన్యూ అధికారుల కళ్ళు కప్పి ఇరువురు కలిసి భూ కబ్జాలకు తెరలేపారు. గతంలో ఈ ప్రాంతంలో స్థానికంగా దళిత గ్రామ ప్రజలు స్మశాన వాటికగా వినియోగించుకుంటున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో స్తానిక ప్రాంతంలో భారీగా ముళ్ళ మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఇదే అదునుగా చూసిన స్థానిక తెల్ల చొక్కా నాయకుడు గుట్టు చప్పుడు కాకుండా కబ్జా వ్యవహార చక్కబట్టే ప్రయత్నం చేశాడు. ఈయన గారి తీరుతో స్థానిక ప్రజలు ఏం మాట్లాడాలో అర్థం కాక ఏ నాయకుడిని, ఏ అధికారిని ప్రసన్నం చేసుకోవాలో తెలియక కకావికలమవుతున్నారు. ఇకనైనా జిల్లా రెవెన్యూ మరియు మండల రెవెన్యూ అధికారులు, చొరవ తీసుకొని ఈ భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.



# విద్యార్థుల నడుమ జన్మదిన వేడుకచేసుకున్న యోగిరాజు

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** ప్రభాస్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు యోగి రాజు జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం జన్మదిన వేడుకలు, పలు సేవా కార్యక్రమాలు యోగిరాజు అభిమానులు, శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించారు. ముందుగా గూడూరు రూరల్ పరిధిలో ఉన్న డేనియల్ చిల్డ్రన్ హోమ్ విద్యార్థుల నడుమ కేక్ కట్ చేసుకొని విద్యార్థులకు విద్యాసామాగ్రి అందజేశారు. అనంతరం మధు రెడ్డి కాలనీలో నిరుపేదల మధ్య కేక్ కట్ చేసి, అక్కడి వారికి దుప్పట్లు అందచేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలలో మనోజ్, వెంకీ, రవి, వెంకి, ప్రశాంత్, తులసి, వంశీ, పుష్కల్, మురళి, శేఖర్, గోపాల్, రాజేష్ పాల్గొన్నారు.



# తిరుపతి అభివృద్ధికి కలిసి పని చేద్దాం

**ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**అభివృద్ధి అంశాలకు కౌన్సిల్ ఆమోదం**

**మేయర్ శిరీష, కమిషనర్ అదితిసింగ్**

**తిరుపతిని అభివృద్ధి వైపునకు తీసుకెళ్దాం**

**ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం**

**తిరుపతి మున్సిపాల్టీ, మేజర్‌న్యూస్:** తిరుపతి అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది అందరు కలిసి పని చేద్దామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో కోరారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఎస్వీ యూనివర్సిటీ సెనెట్ హాల్లో మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన, కమిషనర్ అదితిసింగ్ ఐఏఎస్ అజెండాను ప్రవేశ పెట్టడం జరిగింది. కౌన్సిల్ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎం.పి డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సి సిపాయి సుబ్రమణ్యం హాజరవగా డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు కౌన్సిల్ సమావేశంలో అజెండా అంశాలపై చర్చించి ఆమోదించడం జరిగింది. సమావేశంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధి కోసం ఎంపి, ఎమ్మెల్సీ, మేయర్, కార్పొరేటర్లు, అధికారులు అందరి సహకారంతో పని చేద్దామన్నారు. తిరుపతిలో అండర్ డ్రైనేజి సిస్టం పాతది అయిపోవడం, కొత్తగా యుడిఎస్ ఏర్పాటు చేసుకోవల్సిన అవసరం ఉందన్నారు. శానిటేషన్ మెరుగు పరుచుకోవాల్సిన అవసరం వుందని, త్రాగునీరును సాఫిగా సరఫర జరిగేలా చూడాలని, ఇన్నర్ రహదారులను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. టిడిఆర్ బాండ్లపై వస్తున్న ఆరోపణలపై ఒక నిజనిర్ధారణ కమిటి ఏర్పాటు చేయాలన్నారు. ఆగస్టు 15 లోపు అన్న, డొక్కా సీతమ్మ క్యాంటీన్లు ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసు కోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు.



మేయర్ డాక్టర్ శిరీష మాట్లా డుతూ మన కౌన్సిల్ ఆహ్వానితులుగా నియ మితులైన ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సిల సహకారంతో తిరుపతిని అభివృద్ధి చేసు కుందమాన్నారు. నగర అభివృద్ధి కోసం అధికారుల సహకారంతో కార్పొరేటర్లు అందరం కృషి చేద్దామన్నారు. కమిషనర్ అదితిసింగ్ మాట్లాడుతూ అభివృద్ధి అంశాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదించడం జరిగిందన్నారు. కార్పొ రేటర్లు తెలియజేసే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ ఎప్పుడో 30 సంవత్సరాల ముందు ఏర్పాటు చేసుకున్న యుడిఎస్ సిస్టం మొత్తాన్ని నూతనంగా నిర్మించుకోవాలని సూచిస్తూ ఇందుకోసం ఎంపిగా పూర్తిగా సహకరిస్తానని తెలిపారు. తిరుపతిలో ఆర్టీసి బస్టాండ్, రైల్వే స్టేషన్ల అభివృద్ధికి, ముఖ్యంగ తిరుపతి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సి సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ తిరుపతిని అందరి సమన్వయంతో కలిసికట్టుగా అభివృద్ధి వైపుగా తీసుకెలు దామన్నారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ మాట్లాడుతూ అన్ని డివిజన్లలో అభివృద్ధి చేయాల్సిన పనులు వున్నాయని, వాటిపై దృష్టి సారించాలని సూచించారు.

అజెండాలోని తీర్మానించిన ముఖ్య అంశాల్లో లక్ష్మీపురం సర్కిల్, రామానుజుచార్య సర్కిల్, ఆర్టీసి బస్టాండ్ సర్కిల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు కొరకు 55.89 లక్షలను కేటాయించడం జరిగింది. ఒక సంవత్సరానికి 23అద్దె వాహనములు ఏర్పాటు చేసుకొనుటకు 1,03,20,000లను ఆమోదించడం జరిగింది. తూకివాకం డ్రైవేస్ట్ షెడ్‌కు మిషనరి, ఫౌండేషన్, లైటింగ్ కోసం 39,85,000 ఆమోదం. 11వ వార్డులో పెద్ద కాపు లేఔట్ ప్రదేశంలో సిసిరోడ్డు, కాలువల నిర్మాణానికి 37.80లక్షలకు ఆమోదం. హెల్త్, ఇంజనీరింగ్, యుడిఎస్ కార్మికులకు, సిబ్బందికి యూనిఫారం, చెప్పులు, సోపులు, కొబ్బరినూనె తెప్పించుటకు 87,10,000 ఆమోదం. 35వ వార్డులో పాత యుడిఎస్ పైప్ లైన్లు మార్చుటకు, రోడ్లు డ్యామేజ్ అయిన చోట్ల కొత్త సిసి రోడ్లు వేయుటకు 40,70,000 ఆమోదం. 1 నుండి 50 వార్డుల్లో యుడిఎస్‌లైన్లు నందు బ్లాక్ తీయుటకు కావల్సిన వస్తువులు, మిషనరి కోసం 41,55,000 ఆమోదం. జోన్ 1,3,4 వార్డుల్లో 49.35 లక్షలు, అదేవిధంగా 5,6,7 వార్డుల్లో పెద్ద కాలువల్లో పూడికలు తీయించుటకు 49.80 లక్షలకు ఆమోదం. వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు చేసి, యాంటీ రాబీస్ వ్యాక్సిన్లు వేయుటకు ఒకొక్క కుక్కకు 1200/- చొప్పున అనిమల్ కేర్ ల్యాండ్ వారికి సంవత్సరానికి అయ్యే ఖర్చు 48.6 లక్షలు చెల్లించేందుకు ఆమోదం. నగరంలోని 4 అన్నా క్యాంటీన్లను ప్రైవేటు వారికి కేటాయించిన లీజులను రద్దు పరుస్తూ, త్వరలోనే అన్నా క్యాంటీన్లు ఏర్పాటుకు ఆమోదం. తిరుపతి నగరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహాం ఏర్పాటుకు ఆమోదం.

## కొండమిట్ట గంగమ్మకు సారే సమర్పణ

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం ఎన్టీఆర్ నగర్ కొండమిట్ట గంగమ్మ తల్లికి సారే శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఇది ఆనవాయితీగా అమ్మవారికి సారి సమర్పించడం జరుగుతుంది. గంగమ్మ కమిటీ సభ్యులు స్వాగతం పలుకుతూ పెద్దలు జనుమాల గురవయ్య, చెంబేటి సురేష్, చెంబేటి రాజా, చెంబేటి సుబ్రహ్మణ్యం, రమణారెడ్డి విజయ్, షఫీ, అనసూయమ్మ గంగమ్మ, రాణి. పట్టణ నాయకులు గరికపాటి చంద్ర, అట్లా రమేష్, ధన, మైనంపాటి. మస్తాన్, టైలర్ శీను, సుధీర్, ప్రసాద్, సాయి, పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.



## ఫేక్ ఆఫర్లతో మా కడుపులు కొట్టద్దు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఫేక్ ఆఫర్లతో తమ కడుపులు కొట్టొద్దని తిరుపతి మొబైల్ షాప్స్ అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. పోటీ ప్రపంచంలో రోజురోజుకి మొబైల్ ఫోన్లు వాడకం పెరగడంతో వినియోగదారులు ఆఫర్లు అందించే దుకాణాలలో మొబైల్ ఫోన్లు కొనేందుకు ఎగబడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తిలక్ రోడ్డు శ్రీదేవి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఓ ప్రముఖ మొబైల్ షాప్‌లో ఫేక్ ఆఫర్లతో వినియోగదాలను ప్రజలను మోసం చేస్తున్నారని, దీనిని గమనించిన తిరుపతి మొబైల్ షాప్ అసోసియేషన్ సభ్యులు షాపు వద్ద కూర్చుని ధర్నా చేపట్టారు. తద్వారా తమ వ్యాపారాలకు గండి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తిరుపతి మొబైల్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ఈ షాపు ఓపెనింగ్ నుంచి ఫేక్ ఆఫర్లతో కస్టమర్లను మోసం చేస్తున్నారని, ఈ షోరూమ్‌లో మొబైల్స్ కొనవద్దని కొనుగోలుదారులను అభ్యర్థించారు. ధమాకా ఆఫర్ ఒక గంటలో ఎవ్వరు ఇవ్వని ధరలకు తాము ఇస్తున్నట్లు మొబైల్స్ విక్రయించడానికి తప్పు పట్టారు. సెల్ ఫోన్స్ కంపెనీ కూడా ఇవ్వలేని ధరకు మీరు ఎలా విక్రయిస్తారని ప్రశ్నించారు. ఈ నిరసనలో తిరుపతి మొబైల్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, మున్న, చేతన్, లోకేష్, కుమార్, కిషోర్, మహేష్, శీను పాల్గొన్నారు.



## రైతులకు పచ్చ రొట్టి విత్తనాలు పంపిణీ : ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం రైతులకు శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ కార్యాలయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగులు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ బొజ్జల కుటుంబం రైతు కుటుంబామని, రైతన్నలకు బొజ్జల కుటుంబం ఎప్పుడు అండగా ఉంటుదని, అదే విధంగా తమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతన్నలకు అండగా ఉండి, రైతుల అభివృద్దే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు, శ్రీకాళహస్తి నియోజకవర్గం మండలాలలో, పంచాయతీలలో సాయిల్ టెస్టిగ్ కేంద్రాన్ని స్టోరేజ్ గోదాములు, ఏర్పాటు చేస్తామన్నారు, తద్వారా రైతులు పండించుకున్న పంటలు గిట్టుబాటు ధరకు అమ్ముకునే దానికి వీలుగా ఉంటుందని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు, ఆర్గానిక్ పంటలు పండించడానికి రైతులు ముందుకు రావాలని రైతులకు పిలుపునిచ్చారు, ఆర్గానిక్ పంటలకు దేశ విదేశాల్లో మంచి రాబడి ఉందని, ఆర్గానిక్ పంటలు పండించుకుని రైతులు లాభం పొందాలని కోరారు, ఆయా మండలాలు పంచాయతీలో ఉన్న చెరువులను మరమ్మత్తులు చెసి రైతులకు నీటి కొరత లేకుండా చూస్తామన్నారు, రైతన్నలందరూ పిఎం కిసాన్ పథకానికి తీసుకొని లబ్ధిపొందాలని, అదేవిధంగా తెలుగుదేశం ప్రభుత్వం అన్నదాత ద్వార 14000వేల రూపాయులు రైతన్నలకు అందజేస్తుమని. ఆ పథకాన్ని కూడ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు ఎక్కడైనా అధికారులు నాసిరకం విత్తనాలు అందజేస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటా మన్నారు. రైతులు ప్రభుత్వం ద్వారా అందించబడే ఈ భూసారాన్ని పెంచే విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు సేవ కేంద్రాలలో ఈ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని. 50శాతం రాయితీపై పిల్లి పెసర, జనుము విత్తనాలు అందజేస్తున్నామని. ఈ రాయితీని రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



# కుల మతాలకతీతంగా సంక్షేమాన్ని అందిస్తాం

### ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** కులం మతంతో సంబంధం లేకుండా నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు అన్ని మతాలకు చెందిన ప్రజలకు సంక్షేమ పాలనను అందించడమే లక్ష్యంగా టిడిపి కూటమి ప్రభుత్వం అజెండా అని చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. బుధవారం చిత్తూరు నగరంలోని 14, 15 డివిజన్‌లకు చెందిన ప్రశాంత్ నగర్, వైయస్సార్ కాలనీలో ముస్లిం మత సోదరుల కోసం నిర్మిస్తున్న ఈద్గా నిర్మాణానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ గతంలో ఈద్గాకు సంబంధించిన స్థలాన్ని కొంతమంది కబ్జా చేశారని ముస్లిం



సోదరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తక్షణమే స్పందించి వారి స్థలాన్ని వారికి కేటాయించడం జరిగిందన్నారు. ఈద్గా నిర్మాణానికి తన జీజేఎం చారిటబుల్ ట్రస్ట్ నుంచి తన వంతు సాయం అందిస్తానని ముస్లిం మత పెద్దలకు, ముస్లిం సోదరులకు హామీ ఇచ్చారు. ప్రశాంత్ నగర్‌లో నివసిస్తున్న ప్రజలు తమకు నీటిఎద్దడి, మురుగు కాలవ సదుపాయాలు కల్పించాలని కోరారు. నేటి నుంచే మంచినీటి సదుపాయం కల్పిస్తామని, సాధ్యమైనంత తొందరగా ఇతర సదుపాయాలను కల్పించడం జరుగుతుందని స్థానిక 14, 15 డివిజన్లకు చెందిన ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ వెంకటీల, టిడిపి రాష్ట్ర బీసీ నాయకులు వెంకటేష్ యాదవ్, 14, 15 డివిజన్ల ఇన్చార్జ్ మధుబాబు, ముస్లిం నాయకులు జాఫర్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మేజర్ పంచాయతీ పరిధిలోని సుద్దుగుంట గ్రామంలో సుమారుగా 750 మంది జనాభా కలిగి ఉన్నారు మా గ్రామానికి చెందినవారు వార్డ్ మెంబర్ నుండి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు పదవులు పొందినారు. అటెండర్ నుంచి జిల్లా కలెక్టర్ స్థాయి వరకు రాష్ట్రానికి సిఎస్ చీఫ్ సెక్రటరీ స్థాయి వరకు పదవులు పొందినారు విదేశాల్లో కూడా స్థిరపడిన వారు కూడా ఉన్నారు రాష్ట్రంలోనే ఒక ఆదర్శ గ్రామంగా ఉన్న మా గ్రామం ప్రభుత్వం ద్వారా ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో గ్రామంలో నివసిస్తున్న గ్రామ ప్రజలు ఇతర గ్రామాలు పట్టణాలకు తరలి వెళ్ళిపోతున్నారు సరైన గృహ సదుపాయం లేని కారణంగా గ్రామస్తులకు సరైన ఇండ్లు నిర్మాణం కోసం గ్రామానికి తూర్పున 177 సర్వే నంబరు గల భూమిని ప్రభుత్వం వారు గ్రామస్తులకు సరైన ఇండ్ల నిర్మాణం కోసం ఇవ్వాల్సిందిగా తెలియపరచినాము రెవెన్యూ మ్యాప్‌లో సుద్దుగుంట గ్రామం హరిజనవాడగా ఉంది రెవెన్యూ మ్యాప్‌లో మాదిగవాడిగా మార్చవలెను. గ్రామానికి సరైన త్రాగునీటి సౌకర్యం లేదు సరైన వాటర్ హెడ్ ట్యాంక్ లేదు సరైన డ్రైనేజ్ వ్యవస్థ లేదు వీధి దీపాలు విద్యుత్ సౌకర్యం లేదు గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. అంగన్వాడి కేంద్రం లేదు కమ్యూనిటీ హాల్ లేదు మా గ్రామంలో సుమారుగా 750 మంది జనాభా గ్రామ పెద్ద ఉసురు పాటి పద్మనాభం కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే వారి యొక్క సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

# పేదల ఆశయాలనుగుణంగా పనిచేస్తా

### ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాజకీయ బ్రోకర్లకు తావులేదు

### అధికారుల సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** పేదల ఆశయాలకనుగుణంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, భారీ మెజారిటీతో గెలిపించిన మీ నమ్మకాన్ని వమ్ము చేయనని గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం మొట్టమొదటి సారిగా చిట్టమూరుకు విచ్చేసిన ఆయన విజయోత్సవ ర్యాలీ కార్యక్రమం అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అధికారుల సమన్వయ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపా అవినీతి,రాక్షస పాలనకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన ప్రజా నీకానికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. గత పాలకుల పాపంతో రాష్ట్రం అప్పులు కుప్పగా మారి అభివృద్ధికి శాపంగా మారిందన్నారు. తెలుగుదేశం పార్టీ కాలంలో చేసిన అభివృద్ధే తప్ప, వైసిపి పాలనలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేద న్నారు. అధికారుల సహకారంతో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందన్న ఆయన ఉపాధ్యాయుల మద్దతు మరచిపోలేనిదన్నారు. మండలంలో భూస్వాముల గుప్పట్లో ఉన్న భూములను స్వచ్ఛందంగా వదిలేయా లని లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గతంలో కార్యాలయాల్లో నలుగురు బ్రోకర్లు తిష్ట వేసి కార్యక్రమాలు చక్కదిద్దారని, అవినీతి, అక్రమాలకు తావుండకుండా అధికారుల పనితీరు ఉండాలని, పేదలకు అన్యాయం జరిగితే సహించనన్నారు. వాలంటీర్లకు, వీఓఏలు, అర్హులైనపింఛన్ లబ్ధిదారులకు, పేదలకు అన్యాయం జరగదన్న ఆయన అనర్హుల ఏరివేత కార్యక్రమాన్ని అధికారులే చేపట్టాలన్నారు. ఐదేళ్లలో అందని ద్రాక్షగా మార్చిన ఇసుకను నెలలోపే అమలు చేశామని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరస్తామన్నారు. ఆయా గ్రామాల నుండి సమస్యలపై వచ్చిన వారి నుండి వినతి పత్రాలు స్వీకరించారు. అంతకుముందు మండల కార్యాలయాల సముదాయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన రైతుసేవా కేంద్రాన్ని ప్రారంభించి, తహసిల్దార్ కార్యాలయ ఆవరణంలో నందమూరి తారక రామారావు విగ్రహప్రతిష్ట నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించి, మొక్కలు నాటారు. అధికారుల సమన్వయ సమావేశం సందర్భంగా అన్ని శాఖల అధికారులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సన్మానించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ శర్మ, ఎంపీడీవో నాగరాజు, ఎస్ఐ చిన్న బలరామయ్య, రీసర్వే డిప్యూటీ తహ సిల్దార్ నిరంజన్, ఏపీఎం ఉమాదేవి అన్ని శాఖల అధికారులు, ఆరూరు ఎంపీటీసీ ఆరు భార్గవి, మాజీ మండలాధ్యక్షురాలు యల్లసిరి మంజులమ్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు, సర్పంచులు, ఆయా గ్రామాల ప్రజలు పలువురు పాల్గొన్నారు.







# డ్రైనేజీ నీటితో ప్రజల కష్టాలు

**- మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కౌన్సిలర్ ఆవేదన**

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** స్థానిక మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో పాటు భారీ భవనాలు,హోటల్ యజమానులు డ్రైనేజీ నీటిని రోడ్లపై వదిలేయడంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. దీనితో ఆ దారుల వెంట వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా మార్గాల్లో ద్విచక్ర వాహన చోధకులు వెదజల్లుతున్న డ్రైనేజీ నీటితో పాదచారుల దుస్తులు రంగు మారుతున్నాయి. ఆ దారుల వెంట వెళ్లే విద్యార్థులు తమ యూనిఫాంలు మురికి పట్టి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్గంధం వెదజల్లే డ్రైనేజీ నీటిని రోడ్లపై వదిలేస్తున్నారని మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్న ఫలితం కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అమరావతి హోటల్ వారు తమ హోటల్ నుండి విడుదలవుతున్న వ్యర్థపు నీటిని రోడ్డుపైకి వదిలివేస్తున్నారు. దీనితో ఆ మార్గం వెంట వెళ్లే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. అమరావతి హోటల్ వారు హోటల్ నుండి వచ్చే వ్యర్థపు నీటిని రోడ్డుపైకి వదిలేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ కు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడంలేదని కౌన్సిలర్ దువ్వూరు లక్ష్మీనారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

**- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్**
**- 48వ వార్డు పరిధిలో మార్నింగ్ వాక్ నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే**

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం కోసమే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. బుధవారం ఉదయం ఎమ్మెల్యే. మేయర్ ఎస్ అముద, కమిషనర్ డా. జె అరుణ, స్థానిక నాయకులతో కలిసి 48వ వార్డు పరిధిలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇందిరా నగర్‌లో ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయా స్థానికంగా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. వీధిలో ఉన్న మట్టిదిబ్బలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తంగవేలు కాలనీలో పెద్ద కాలువలు పరిశీ లించారు. స్థానికుల వినతి మేరకు కాలువలో పూడిక తీయడానికి చర్యలు చేపట్టాలని నగరపాలక అధికారులను ఆదేశించారు. అనంతరం రాజీవ్ నగర్, వన్నియర్ వీధిలో పర్యటించారు. వన్నియర్ వీధిలో కాలువ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ, స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా వార్డుల్లో పెద్ద ఎత్తున కాలువల్లో పూడికతీత కార్యక్రమం జరుగుతోందని, ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు కమిషనర్ ఎమ్మెల్యేకి వివరించారు. యాక్షన్ ప్లాన్ లో నిర్దేశించిన మేర అన్ని కాలువల్లో పూర్తిస్థాయిలో పూడిక తొలగిస్తామని వివరించారు. కార్యక్రమంలో నగర పాలక అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



48వ డివిజన్లో ప్రజా సమస్యలు ఆలకిస్తున్న నియోజకవర్గం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

# ఆధ్యాత్మిక నగరంలో ప్రశాంతత నెలకొల్పుతాం

**- ఎన్డీఏ కూటమి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తా**
**- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** పవన్‌కళ్యాణ్, చంద్రబాబు, మోదీ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వెల్లడించారు. ఆధ్యాత్మిక నగరంలో ప్రశాంత వ్వాతావరణాన్ని నెలకొల్పి తీరుతామని ఆయన చెప్పారు. 35, 42,43,44 డివిజన్లలో ఎన్డీఏ కూటమి నేతలకు కృతజ్ఞత సమావేశం టిడిపి క్లస్టర్ ఇంచార్జీ ఆర్ సి మునికృష్ణా ఆధ్వర్యంలో సప్తగిరి నగర్ లోని కమ్మ సంఘంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ మెజారిటీతో గెలిపించిన తిరుపతి ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. కసితో జనం ఓట్లు వేసి రాక్షస సంహారం చేసి 62వేల ఓట్ల మెజార్టీ కల్పించారని ఆయన చెప్పారు. నగరంలోని ప్రతి డివిజన్‌లోనూ ఎన్డీఏ కూటమి కి అత్యధిక మెజారిటీ వచ్చిందని ఆయన తెలిపారు. డివిజన్ స్థాయిలో ఎన్నికల్లో కష్టపడ్డ పని చేసిన వారికే నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించనున్నట్లు ఆయన మరోసారి చెప్పారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డులు అందిస్తామని ఆయన తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పాలన అంతా వేధింపులు, అక్రమ కేసులు, దోపిడి, బెదిరింపులే జరిగాయని ఆయన ఆరోపించారు. అనంతరం 2,3,4,12 డివిజన్లు, శెట్టిపల్లి ప్రాంతానికి చెందిన కృతజ్ఞత సమావేశం లక్ష్మీపురం సర్కిల్ లోని ఓ ప్రైవేట్ హోటల్ లో టిడిపి క్లస్టర్ ఇంచార్జీ కృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ,మహేష్ యాదవ్, రాజారెడ్డి, ఆకేపాటి శుభాషిణి, పోటుకూరి ఆనంద్, పొనగంటి భాస్కర్, నాగభూషణం, రాజేష్ ఆచ్చారి, బాబ్జీ, చల్లా సెల్వం, సుబ్బు యాదవ్, కొండ రాజ్ మోహన్, బాలమురళీ, రామక్రిష్ణ పాల్గొన్నారు.



# కాణిపాకం గణనాథుని సేవలో చిత్తూరు ఎంపీ

**ఐరాల, మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారిని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గ మళ్ళ ప్రసాద్ రావు బుదవారం దర్శించుకున్నారు. స్వామి వారి సందర్శ నార్థం విచ్చేసిన వారికి అలయ సంప్రదాయ ప్రకారం, ఆలయ ఎఈఓ విద్యాసాగర్ రెడ్డి, అర్చకులు, వేదపండితులు రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు.తరువాత వారికి ఆలయ అశ్వరచన మండపంలో వేదపండితులు చే అశ్వరచన చేసిన తరువాత, ఆలయ ఎఈఓ విద్యాసాగర్ రెడ్డి చేతులు మీదగా స్వామి వారి తీర్ధ ప్రసాదాలు, చిత్ర పటాలు, పట్టు వస్త్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో కాణిపాకం ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ మణి నాయుడు, ఐరాల మండల మాజీ జిల్లా పరిషత్ సభ్యులు లత బాబునాయుడు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులతో తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేశారు. ఈ సందర్భంగా రేణిగుంట విమానాశ్రయంలో బిజెపి నాయకులతో తిరుపతి జిల్లా అధ్యక్షులు డా.చంద్రప్ప మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.



కేంద్ర మంత్రి బండితో డాక్టర్ చంద్రప్ప

# విజయం విద్యాసంస్థల్లో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ వేడుకలు

**చిత్తూరుఅర్బన్, మేజర్‌న్యూస్:** నగరంలోని స్థానిక సుందరరాజపురం నందు గల విజయం సీ.బీ.ఎస్.ఈ పాఠశాలలో "ఇన్వెస్టిట్యూర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజా కార్యక్రమంలో దీపప్రజ్వలన అనంతరం. విద్యార్థులచే ఓటింగ్ ద్వారా ఎంపికకాబడిన పాఠశాల క్యాబినెట్ లోని సభ్యులు హెడ్ బాయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్, అసిస్టెంట్ స్పోర్ట్స్ కెప్టెన్,హౌస్ కెప్టెన్లకు బ్యాడ్జ్,స్లాష్ రిబ్బన్లను ప్రధానం చేసి వారిచే విశ్వాసం,ఆశ, నిబద్ధత, కరుణ,విధేయతలను గూర్చి బాధ్యతను అప్పగిస్తూ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు డాక్టర్ తేజోమూర్తి ఎంపిక కాబడిన క్యాబినెట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ "విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్ లో పాల్గొని తమ నాయకులను ఎన్నుకోవడం హర్షించదగ్గ విషయం అని, విద్యార్థి దశ నుంచే మంచి నాయకులను ఎన్నుకోవడం, నాయకత్వాన్ని నిర్మించడం వంటి సామర్థ్యాలను కలిగి ఉండడం అవసరం అన్నారు.గొప్ప నాయకుల స్ఫూర్తితో దేశ భవితలో భాగం కావాలని విద్యార్థులకు సూచించారు. అకాడమిక్ డైరెక్టర్ డా.శైలజ మూర్తి ప్రసంగిస్తూ "ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా జీవిస్తూ జీవనప్రమాణాలను మెరుగుపరుచు కోవాలన్నారు. ఆ ఉద్దేశంతోనే పాఠశాల హౌస్ కలర్స్ గా పంచభూతాలకు ఉపమానాలుగా గల రంగులను ఎంపిక చేశామని వాటిద్వారా బుద్ధి కుశలత,ఏకాగ్రత, క్రమశిక్షణ కలిగి ఉన్నత ప్రమాణాలతో విద్యను అర్జించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.బి కౌసల్య, పీఈటి మాస్టర్లు,ఉపాధ్యాయునీ,ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ఇన్వెస్టిట్యూర్ వేడుకలలో పాల్గొని ప్రసంగిస్తున్న పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ శైలజా మూర్తి

# బాధితుల నుంచి ఒక్క మెసేజ్ వస్తే తక్షణమే స్పందిస్తా : ఎమ్మెల్యే డా. విఎం థామస్

**కార్వేటీనగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం మండలంలో సమస్య మీది పరిష్కారం నాది అనే కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు చంగల్రాయ్ యాదవ్, ఎంపీపీ లతా బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్, ఎమ్మెల్యే విఎం థామస్ విచ్చేసి ప్రజా సమస్యలపై ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించి సానుకూలంగా వారి సమస్యలు అతి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ నా పేరు చెప్పి బంధుమిత్ర సహచరులు అక్రమాలకు అవినీతికి పాల్పడితే అట్టి వారిపై కఠిన చర్యలు తప్పవని అని హెచ్చరిస్తూ మీకు ఉద్యోగాలు ఇప్పిస్తానని, ఉద్యోగాలు ట్రాన్స్‌ఫర్ చేస్తానాని, నేను ఎమ్మెల్యేకి అనుచరుడినని నా రక్తసంబంధికులైన నా మిత్రులైన అవినీతి అక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటాం అని ఎమ్మెల్యే అన్నారు. నేను రాజకీయాల్లోకి వచ్చింది కక్ష సాధింపు రాజకీయాలను కొనసాగించడానికి రాలేదని, పేద ప్రజల అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు.నా పేరు చెప్పి లెటర్లు తీసుకువస్తా నీకు ఏ పని కావాలన్నా చేస్తానని లంచమడిగితే మీరు డైరెక్టుగా నాకు ఫోన్ చేయొచ్చు లేదా వాట్సాప్ ధ్వారా విషయాన్ని తెలుపగలరని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.నా గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు, నాయకులకు, నియోజకవర్గ ప్రజలకు మీఅభివృద్ధికి ఏమి కావాలన్నా, ఎవరితో మాట్లాడి అయినా చేస్తానన్నారు. మొత్తం 604 సమస్యలపై వినతి పత్రాలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరి ఆర్డీవో వెంకట్ రెడ్డి ఎంపీడీవో శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ పుష్పకుమారి అన్ని శాఖల అధికారులు, జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# యువతకు తోడుగా చంద్రన్న నీడ

**- భావితరాలకు చంద్రబాబు నాయుడు అండగా నిలబడతారు - ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్**

**- ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యాసమాగ్రి వితరణ**

**గుడిపల్లి, మేజర్‌న్యూస్:** భావితరాలకు బాటలు వేస్తు యువతకు రేపటి భవిష్యత్తును అందించేందుకు నిరంతర కృషి సాధకుడై, ఎప్పుడు తన రాష్ట్ర ప్రజల అభివృద్ధిని కోరుకునే తమ నాయకుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన నారా చంద్రబాబు నాయుడు తమ కుప్పం నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించడం తమకెంతో ఆనం దంగా ఉందని పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన గుడిపల్లి మండలంలో ప్రభుత్వ పాఠ శాలలో చదువుతున్నటు వంటి విద్యార్థులకు విద్యా సమా గ్రిని అందించే కార్యక్ర మం బుధవారం గుడిపల్లి, శెట్టిపల్లి పాఠశాలలో నిర్వహించామన్నారు. ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యార్థుల కు కావలసిన వసతులన్నీ సక్రమంగా ఉండే విధంగా చూడడం తమ బాధ్యతని, ప్రభుత్వ పాఠ శాలలో నాణ్యమైన విద్యను అందించి విద్యార్థుల భవి ష్యత్తుకు ఉపాధ్యాయులు బాటలు వెయ్యాలని, అదేవిధం గా విద్యార్థులు కూడా చదువుల్లో రాణించి తల్లితండ్రుల కు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మె ల్సీ విద్యార్థులకు సూచించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఏ విధంగా అయితే రాష్ట్రాన్ని అభివృద్ధి పథం లో నడిపిస్తున్నారు రేపటి తరానికి బంగారు బాటలు వేయడానికి ఆయన ఏవిధంగా కష్టపడుతున్నారు విద్యార్థులకు ఆయన వివరించారు. అదేవిధంగా గత ప్రభుత్వం ప్రజాధనాన్ని వృధాగా ఖర్చు చేస్తూ పేదోడిపై భారాన్ని మోపేవారని, అలాంటి పరిస్థితి తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాకూడదని ఉద్దేశంతో గత ప్రభుత్వం అతి విశ్వాసంతో తామే మరోసారి గెలుస్తామని ధీమాతో విద్యార్థులకు సంబంధించిన టువంటి సామాగ్రిపై వారి ఫోటోలను ముద్రించుకొని ముందుగానే ఆ సమాగ్రిని పాఠశాలలకు చేర్చడం జరిగిందని, అటువంటి వారికి చెంపపెట్టుగా తిరిగి ప్రభుత్వ ఖజానా ఖర్చు కాకుండా చూసే విధంగా తమ నాయకుడు ఆలోచింపజేసి దేశంలో ఎక్కడా చూడని విధంగా గత ప్రభుత్వం ఉంచిన అవే విద్యా సామాగ్రిని విద్యార్థులకు అందించడం జరిగిందని దీని ద్వారా తమ నాయకుడి హొదా ఎటువంటిదో గత ప్రభుత్వ నాయకు లు తెలుసుకోవాలన్నారు. అదేవిధంగా కుప్పం అభివృ ద్ధిపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారని కుప్పంలో మునుపెన్నడూ లేని విధంగా నియోజక వర్గలతో కాకుండా రాష్ట్రాలతో పోటీపడే విధంగా అభివృద్ధిని చేసి చూపెడతామన్నారు. గుడిపల్లి ఎప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనకు గుండెతో సమానమని గుడిపల్లి ప్రజలు తనని ఎంతో ఆదరిస్తారని కుటుంబ సభ్యుల్లో ఒకడిగా ఎప్పుడు ప్రజలు గుర్తుపెట్టుకుంటారని అటువంటి వారికి తన వంతుగా ఏదైనా చేయాలని తపన నిరంతరం ఆయన మదిలో మెదులుతూనే ఉంటుందని, నియోజకవర్గంలో ఏ మండలంలోనూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాల ముఖ్యంగా పిఇ ఎస్ ఆసుపత్రి వంటి వాటిని గుడిపల్లి మండలంలో ఏర్పాటు చేసి ఎంతోమందికి యువతకు విద్యను అందించి వారి అభివృద్ధికి పునాదులు వేసి జీవన ఉపా ధిని కల్పించారాని, మండల అధ్యక్షులు బాబు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ భవాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ మునిరాజు, మాజీ మండల అధ్యక్షుల హేమంబర్ గౌడ్, మాజీ జెడ్పిటిసి బెటప్ప నాయుడు, ఎస్సి సెల్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, గుడిపల్లి పంచాయతీ అధ్యక్షులు మంజునాథ్, బిజెపి పార్టీ అధ్యక్షులు శివకుమార్, లక్ష్మీపతి పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందిస్తున్నటువంటి ఎమ్మెల్సీ, టీడీపీ మండల నాయకులు

# పారిశుద్ధ్యం పనుల్లో నిర్లక్ష్యం తగదు

**- నగర కమిషనర్ డా జె.అరుణ**

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** నగరంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ డా. జె అరుణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధ వారం ఉదయం కమిషనర్ వేలూరు రోడ్, గంగినేని చెరువు, గిరింపేట, దుర్గమ్మ గుడి, కలెక్టరేట్ సర్కిల్ ప్రాం తాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పను లను తనిఖీ చేశారు. గంగినేని చెరువు వద్ద పారిశుద్ధ్య వాహనాల లాగ్ పుస్త కాలను పరిశీలించారు. ప్రస్తుతం జరు గుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్ర మాల దృష్ట్యా అవసరమైన అదనపు ట్రిప్పులు నడపాలన్నారు. ఎక్కడా వ్యర్థాలు కనిపించరాదన్నారు. గంగినేని పార్క్ లోపల, బయట పారిశుద్ధ్యం మరింత మెరుగుపరచాలని కార్యదర్శులను ఆదేశించారు. ఉదయం ఏడు గంటల కల్లా ప్రధాన రహదారుల స్వీపింగ్ పూర్తి చేయాలని, అనంతరం వీధుల శుభ్రత, ఇంటింటి చెత్త సేకరణ పకడ్బందీగా చేయాల న్నారు. స్టాప్ డయేరియా క్యాంపె యిన్ - 2024, సీజనల్ వ్యాధు ల నియంత్రణ చర్యలో భాగంగా గ్యాంగ్ వర్క్‌ల నిర్వహణ పక్కాగా నిర్వహించాలని, పారిశుద్ధ్య పనుల విషయంలో ఎక్కడ నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమర్నాథ్ రెడ్డి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ



పారిశుద్ధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్

# కోర్టు తీర్పు మేరకే తమ భూమిలో ప్రహరీ

**- భూమి బాధితుడు పి. సేతుమాధవ్**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** మైసూరు జిల్లా కోర్టు తీర్పు మేరకు తమ భూమిని చదును చేసి, భూమి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణాలు చేపడుతున్నామని భూమి బాధితుడు పి.సేతుమాధవ్ తెలిపారు. సదురు భూమిపై ఎలాంటి రాజకీయ పలుకుబడి లేదని, ఎలాంటి భూమి వాటాలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. బుధవారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపత రూరల్ మండలం, అవిలాల గ్రామ లెక్కడాలలా సర్వేనెంబర్ 147/1లోనున్న భూమిపై గత అనేక తమకు హథీరాంసజీ మఠం వారికి తిరుపతి కోర్టు, హైకోర్టులో, మైసూరు కోర్టులలో కేసులు విచారణలో ఉండేవన్నారు. అయితే ఎస్. చక్రధర్ చౌదరి అనే అతను లిటిగేషన్ ఉన్న భూమిలను కొనుగోలు చేసి అతను తమ భూమిలో హక్కు ఉందని కల్పించుకొని తమపై తప్పుడు ప్రకటన చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తూ తమ పరువుకు భంగం కలిగించే వారని ఆరోపించారు. పరకాల పఠాధిపతి వారి ద్వారా సదరు నరసింహారెడ్డి అవిలాల గ్రామ సర్వే నెంబర్ 145,147,148/2లో వారి వాటాగా 17.12 పావు సెంట్లు, భూమ అమ్ముకొనేందుకు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పొందారని తెలిపారు. నరసింహ రెడ్డి శ్రీపరకాల మఠం వారికి మైసూరు జిల్లా కోర్టులోలో జరిగిన వాజ్యంలో సుదీర్ఘ విచారించి మఠాధిపతులు సరైన సాక్షాధా రలతో నిరూపించలేక పోవడంతో ఏప్రిల్ 6వ తేదీన నరసింహ రెడ్డికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఈమేరకు మే 19వ తేదీన సదురు భూమికి సంబంధించిన హక్కు విషయంపై పత్రికల్లో తాము బహిరంగ ప్రకటన కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. కోర్టు తీర్పు ఆధారంగా మఠం అధికారులు, రెవెన్యూ, పోలీసు, ఎండో మెంట్ అధికారులకు సైతం సంబంధిత పత్రాలు సమర్పిం చామని తెలిపారు. కోర్టు తీర్పు మేరకు భూమి చదును చేసి ప్రహరీ నిర్మించడం జరుగుతోందని తెలిపారు. నిర్మాణాలను హథీరాంజీ మఠం సిబ్బంది అడ్డుకోవడం జరిగిందన్నారు. మఠం ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు సైతం బెదిరిస్తూ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అయితే ఈ భూమిపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి ఎలాంటి సంబంధం లేదని, తమ భూమిని నానికి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. తమ భూమిపై రాజకీయ రంగుతో ప్రచురించిన విషయాలు అవాస్తవమని తెలిపారు. తమకు ఎలాంటి రాజకీయ నేతల అండ లేదని తెలియజేశారు. ఈ సమావేశంలో న్యాయవాది చిట్టిబాబు, జి.రజనీకాంత్ నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.



# కక్షపూరిత రాజకీయాలకు దూరంగా ఉండాలి

**-ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి**

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** కక్షపూరిత రాజకీయాలకు దూరంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. మండలంలోని 15 పంచాయతీలకు చెంది న తెలుగుదేశం పార్టీ నాయకులతో గోను మాకులపల్లె గ్రామంలో ఎమ్మెల్యే ఆధ్వ ర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలలోని నాయకులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వ హించి పంచాయతీ సమస్యలను అడిగి తెలుకున్నారు. తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కష్టపడ్డవారికి తగిన గుర్తింపు ఉం టుందన్నారు. పార్టీ బలహీనంగా ఉన్నచోట బలోపేతానికి కృషి చేయాలనీ పిలుపునిచ్చారు.న్నారు. పంచాయతీ, గ్రామస్థాయి నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి స్థానిక నాయకులు కృషి చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలను అందించేందుకు కూడా కృషి చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ విజ యభాస్కరరెడ్డి, నాయకులు మురహరిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, శ్రీరాములు, ఆనంద, చలపతి, నాగరాజరెడ్డి, సుధాకరరెడ్డి, భానుప్ర తాప్‌రెడ్డి, పార్థసారధి, సుబ్రమణ్యంరెడ్డి, రామక్రిష్ణ, రాజారెడ్డి, చెంగారెడ్డి, మోహన్ రెడ్డి, వేమారెడ్డి, బట్టందొడ్డి రెడ్డెప్ప, నిడిగుంట సుబ్రమణ్యం, మహేంద్రరెడ్డి, వేణుగోపాల్ నాయుడు, శివాడి నాగరాజ, సొన్నేపల్లె నాగరాజ, గంగప్ప, శంకరప్ప, శ్రీనివాసులు, వరప్రసాద్, ప్రభాకర్ పాల్గొన్నారు.



# శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీ వేంకటేశ్వరుడిని ప్రముఖ సినీ నిర్మాత సురేష్ బాబు దర్శించుకున్నారు. బుధవారం ఉదయం విఐపీ విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండి తులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు పట్టువస్త్రంతో సత్కరించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల సురేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ శంకర్ దర్శకత్వం వహించిన భారతీయుడు 2 చిత్రాని తెలుగులో రీలిజ్ చేస్తున్నామని అన్నారు. సామాజీక భాధ్యతతో తీసే శంకర్ చిత్రాల తరహాలోనే ప్రతి ఒక్కరు సమాజం కోరకు భాధ్యతగా పనిచెయ్యాలన్నారు. సినిమా టిక్కేట్లధర పెంపు పై పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారని తెలిపిన ఆయన టిక్కేట్ల ధరకంటే ప్రేక్షకులను సినిమాకు తీసుకురావడమే మా ముందు వున్న పెద్ద సవాల్ అని స్పష్టం చేశారు.



శ్రీవారిని దర్శించుకున్న నిర్మాత సురేష్ బాబు,డైరెక్టర్ మల్లినేని గోపిచంద్, మ్యూజిక్ డైరెక్టర్ తమన్

# ఘనంగా ముగిసిన ఇన్నోవేషన్ శిక్షణ



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రేన్యూర్ షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, ఎక్సపోజర్ విసిట్ అండర్ ఐఐసి మెంటార్ మెంటీ స్కీం 2023-24 రెండు రోజులు పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం బుధవారం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో సీఈఓ, టిబిఐ డాక్టర్ సూర్య కుమార్ పాల్గొని ఇన్నోవేషన్ ఆవశ్యకతను వివరించారు. ప్రొఫెసర్ పి జోష్ణ ఎంటర్ ప్రిన్యూర్‌షిప్ పై అవగాహన, దానికోసం నిధులను, అవకాశాలని సమకూర్చుకొనుట గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులందరూ వివిధ ఇన్వేషన్ సెంటర్స్ ను చూసి అందులో జరిగిన వివిధ రకాల కార్యక్రమాలను, కార్యకలాపాలను గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సి.వాణి డీన్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ మేనేజ్మెంట్, డాక్టర్ పి మల్లికార్జున డైరెక్టర్ ఎస్ ఓ ఈ టి, ప్రొఫెసర్.ఆర్ నాగరాజు, ప్రొఫెసర్ జి.రజిత, డాక్టర్ లత, డాక్టర్ వైశాలి డాక్టర్ రామకృష్ణ. డెలిగేట్స్ ఐఐసి మెంబర్స్ పాల్గొన్నారు.

## సిగరెట్, బీడీ దుకాణా దారులకు జరిమానా



**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** సిగరెట్, బిడి, ధూమపాన వస్తువులు విక్రయిస్తున్న దుకాణలకు పోలీసులు జరిమన విధించి వసూలు చేశారు. బహిరంగ ప్రదేశాలలో ధూమపానం విక్రయం సేవించడం నిషేధిస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ ఆదేశాలతో పోలీసులు తక్షణమే ధూమపానం నిషేధాన్ని అమలు చేస్తూ బుధవారం అలిపి ఎస్వి యూనివర్సిటీ, రేణిగుంట పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో సిగరెట్టు బీడీ దుకాణాలపై సోదాలు నిర్వహించి తప్పుగా పరిగణించిన ఒక్కొక్కరికి 200 రూపాయలు అపరాధ రుసుముగా జరిమన విధించి వసూలు చేశారు. పాఠశాల కళాశాల విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో దుకాణంలో ధూమపాన విక్రయాలు చేయకూడదని సూచించారు. నిబంధనలు పాటించని దుకాణాలకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అలిపిరి, రేణిగుంట యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్‌తో పూతలపట్టు ఎమ్మెల్యే మురళిమోహన్ భేటీ

**- నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా చర్చ**
**- ఐటీ పరిశ్రమలు, ఇతర పెట్టుబడులపై సాగిన చర్చ**
**- నియోజకవర్గంలో వెనుకబడిన పాఠశాల పునరుద్ధరణ చేయాలని కోరిన మురళిమోహన్**

**ఐరాల, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌తో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్ భేటీ అయ్యారు. ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నాయుడు నివాసంలో నారా లోకేష్‌ను బుధవారం ఎమ్మెల్యే మురళిమోహన్ మర్యాదలు పూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం నారా లోకేష్‌కి కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి తీర్ధ ప్రసాదాలను అందజేసిన తర్వాత నారా లోకేష్‌తో పూతలపట్టు అభివృద్ధిపై చర్చించారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్ళడంతో పాటుగా, ఐటీ పరిశ్రమలు, ఇతర పెట్టుబడులపై చర్చించారు. అంతే కాకుండా నియోజకవర్గంలో వెనుకబడిన పాఠశాల పునరుద్ధరణ, హాస్టల్స్ ఏర్పాటు వంటి అంశాలపై నారా లోకేష్‌తో ఎమ్మెల్యే మురళిమోహన్ చర్చించారు.

## సహకార సంఘాల బలోపేతానికి సేవా కేంద్రాలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ప్రాథమిక సహకార సంఘాలు బలోపేతం చేయడానికి ఈ సాధారణ సేవా కేంద్రాలు తోడ్పడతాయని జిల్లా సహకార అధికారిణి ఎస్ లక్ష్మి తెలిపారు. మంగళవారం సంస్కృతి విశ్వవిద్యాలయంలో జిల్లా సహకార సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారిణి ఎస్ లక్ష్మి మాట్లాడుతూ ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతానికి ఈ సాధారణ సేవా కేంద్రాలు తోడ్పడతాయని పేర్కొన్నారు. ఈ కేంద్రాలలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సామాన్యులు వీటిని పొంది అభివృద్ధి చెందాలన్నారు. ఇతర వివరాలను దగ్గరలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో ఉన్న ముఖ్య కార్యనిర్వహణ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి కార్యాలయ సూపరింటెండెంట్ మద్ధపట్ల వెంకటరమణ, శివశంకర్ నాయక్.సతీష్, శ్రీనివాస్, ప్రవీణ్ ఇతర సహకార సిబ్బంది పాల్గొన్నారు.



# ముగిసిన ఎస్వీయూలో ఎన్నికల ప్రచారం

**- ప్రచారంలో ముందున్న నిలబడుతున్న నూతన అభ్యర్థులు**



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం బోధినేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఐదు సంవత్సరాలకు నిర్వహించే ఎన్నికలకు ఈసారి అధ్యక్ష పోటీలో ఏ గురుమూర్తి, బి వెంకటేశ్వర్లు, గుర్రంకొండ శ్రీధర్ లకు త్రిముఖ పోటీ నెలకొంది. అధ్యక్ష ఎన్నికల్లో ఇద్దరు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో మూడో వ్యక్తికి ఓటర్లు మొగ్గే అవకాశం ఉందని వర్సిటీలో ప్రచారం జరుగుతుంది. సెక్రటరీ పోటీలో ఉన్నటువంటి చంద్రశేఖర్, ఎన్. సుబ్రహ్మణ్యం, కాళహస్తి రవిచంద్ర ల మధ్య కూడా త్రిముఖ పోటీ నెలకొంది. ఇందులో గతంలో ఎన్ సుబ్రహ్మణ్యం కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం అభ్యర్థులు రవిచంద్ర, ఎన్ సుబ్రహ్మణ్యం మద్దతు తీవ్రమైన పోటీ నెలకొన్నట్లు సమాచారం. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఐదు మంది అభ్యర్థుల గాను దాదాపుగా 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇందులో ముఖ్యంగా హేమంత్, చంద్రశేఖర్, అరవింద్ కుమార్, గురు ప్రసాద్, రమేష్, జాడ లక్ష్మీనాథ్, లీలా కృష్ణ, రమేష్ బాబు, విజయ సారధి ఇలా మధ్య తీవ్రమైన పోటీ నెలకొని ఉంది. ఇందులో ముఖ్యంగా హేమంత్, గురు ప్రసాద్, జాడ లక్ష్మీనాథ్, లీలా కృష్ణ లు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే 17 మంది ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మొత్తం ఎస్వియూ క్యాంపస్లో దాదాపుగా 300 పైచిలుకుగా శాశ్వత బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ ఎన్నికలలో వారి ఓట్ల కోసం అధ్యక్ష, కార్యదర్శుల అభ్యర్థులు, ఈసీ మెంబర్ అభ్యర్థులు గత నాలుగు రోజులుగా తీవ్రంగా ప్రచారాలలో మునిగి తేలుతున్నారు. అయితే ఈ సారి జరిగే ఎన్నికలలో నూతన అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని కొంతమంది భావిస్తున్నట్లు సమాచారం. గతంలో వివిధ స్థానాలలో గెలుపొందిన అభ్యర్థులు తమకు ఎటువంటి సహాయ, సహకారాలు అందించలేదని, శాశ్వత విధులు నిర్వహించే సిబ్బంది ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ఎటువంటి ఆదరణ చూపలేదని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల అప్పుడు చేసిన హడావుడి గెలిచిన తర్వాత నాయకులు చూపలేదని ఒక వర్గం వారు ఆరోపిస్తున్నారు. అంతేకాదు బోధనేతర సిబ్బంది ఆఫీసుల్లో పలు రకాలైన సమస్యలను, వేధింపులను పరిష్కరించే ఉన్నత కమిటీలు లేకపోవడం బాధాకరమన్నారు. ఈసారి ఎన్నికలలో అధ్యక్ష కార్యదర్శులకు త్రిముఖమైన పోటీ తీవ్రస్థాయిలో నెలకొని ఉంది. వర్సిటీ వర్గాల్లో ఎవరు గెలుస్తారని ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. సాధారణ ఎన్నికలలో లాగానే ప్రస్తుతం ఎస్వీయూలో ఓటరు నాడిని ఎవరు గుర్తించలేని పరిస్థితిగా ఉంది. అయితే ఎస్వీయూలో ప్రచారంలో అభ్యర్థులు నిరంతరం పోటీ పడుతున్నట్లు కనిపిస్తుంది.

# పట్టణ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** పలమనేరు పట్టణంలోని ప్రజలకు అవసరమైన పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కోరారు. పలమనేరులో గల శాసనసభ్యుల కార్యాలయంలో పలమనేరు పర్యవేక్షణ సమితి సభ్యులు కలిసి ఎమ్మెల్యేని సన్మానించి పలమనేరు పట్టణ సమస్యలు పరిష్కరించాలని కోరారు.పలమనేరు ప్రాంతంలో అత్యధికంగా ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ కోసం అనేక వ్యయప్రయాసల కోర్చి బయట ప్రాంతాలకు వెళుతున్న దృష్ట్యా స్థానిక పలమనేరు ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పిపిఎస్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పిళ్ళై, కార్యదర్శి నరసింహులు, గౌరవాధ్యక్షులు ఆనందబాబు ఆధ్వర్యంలో సమితి సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. పట్టణంలో రోడ్లను, పలు కూడళ్లను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని ట్రాఫిక్ కు ఇబ్బందులు కలుగజేస్తున్న అక్రమ కట్టడాలు, ఆక్రమణలను కూడా తొలగించి ప్రజా రవాణాకు సౌకర్యం కల్పించాలని కోరారు. గతంలో జవిలి వీధి నందు మంజూరైన నూతనకాల్వ రామకృష్ణారెడ్డి కళాక్షేత్రం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, పెద్ద చెరువు మరమ్మతులు చేపట్టి పలమనేరు పట్టణ అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఎంతో ఘన చరిత్ర కల్గిన పలమనేరు ఆర్టిసి డిపో నిర్వీర్యమై పలు సర్వీసులు రద్దుచేసినందు వలన ప్రజల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని గతంలో రద్దయిన సర్వీసులన్నీ పునః ప్రారంభించి డిపోకు కొత్త బస్సులు కేటాయింపబడేట్లుగా చూడాలని కోరారు. సమస్యలన్నింటిని విన్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పలమనేరు పరిరక్షణ సమితికి సభ్యులకుహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు విజయ్ కుమార్, పొన్నుడి, మురళి, నారాయణ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం వరసిద్దునికి రూ.లక్ష విరాళం

**ఐరాల, మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి నిత్య అన్నదాన పథకానికి చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం కొండరాజు కాలువ గ్రామానికి చెందిన వళ్ళేరు దినకర నాయుడు లక్ష రూపాయలు ను అందజేశారు. ఈ విరాళ దాతకు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వామి వారి దర్శనం భాగ్యం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో సూపర్ డెంట్ కోదండ పాణి, టెంపుల్ ఇన్ స్పెక్టర్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యనారాయణపై అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సత్యనారాయణపై అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్నగౌని తులసీరామ్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఆర్ సూర్యనారాయణ పై గతంలో నమోదైన కేసులు న్యాయపరమైనవి కావన్నారు. ఆయన చేసిన పోరాటలు వారి వ్యక్తిగతం కోసం కాకుండా ఉద్యోగ సంక్షేమం కోసం పోరాటాలు చేపట్టారన్నారు. ఆనాడు ఆయన అలంబించిన పోరాట విధానాలన్నీ పూర్తిగా రాజ్యాంగ బద్ధమైనవని తెలియజేశారు. అయితే వారిపై మోపిన అభియోగాలను కేసులను ఉపసంహరించుకునేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున ఆయన కోరారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీపతి, కార్యదర్శి సుబ్బారాయుడు, కోశాధికారి మధుబాబు, నాగేశ్వరరావు, కరీం కోటేశ్వరరావు, రవికుమార్ మనోజ్ పాల్గొన్నారు.

## పొలకల మేజర్ పంచాయతీకి నిధులు మంజూరు చేయండి

**- ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావుకి వినతి**

**ఐరాల, మేజర్‌న్యూస్:** పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం పరిధిలోఉన్న పొలకల మేజర్ గ్రామ పంచాయతీ 8 వేలు పైగా జనాభా వున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కేంద్రం నుండి వచ్చిన ఫైనాన్స్ నిధులు రూ.50 లక్షలు గత ప్రభుత్వం వేరే పథకాలకి విద్యుత్ బకాయిలకి మళ్లించడం జరిగింది. ప్రస్తుతం పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదు సిసి రోడ్లు తాగునీరు బోర్లు విద్యుత్ దీపాలు సైతం లేక కొన్ని గ్రామాలు అంధకారంలో ఉన్నాయని మా మేజర్ పంచాయతీకి ఎంపీ నిధుల నుండి అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు నిధులు మంజూరు చేయాలని పొలకల ఉప సర్పంచ్ సురేందర్ నాయుడు బుధవారం కానిపాకం దైవ దర్శనానికి విచ్చేసిన ఎంపీ దర్గమల్లి ప్రసాద్ రావుకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తమ అర్జీని పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## రెండవరోజు ప్రత్యేక పారిశుద్ధ్యం

**ఐరాల, మేజర్‌న్యూస్:** పారిశుద్యంపై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగారెండవ రోజు అయిన బుధవారం మండలం పరిధిలోని నాగవాండ్లపల్లి, ఎర్రెపల్లి, ముదిగోళం, గాజులపల్లి తదితర గ్రామాలలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రధానంగా పిచ్చి మొక్కలు తొలగించడం, చెత్త కుప్పలు తొలగించడం, మంచినీటి కొళాయిలు, పైపులైన్లు, మరమ్మతులు మురికి కాలువలు శుభ్రపరుచుట, ప్రభుత్వ భవనాలు పరిసరాల పరిశుభ్రం చేసి అంటువ్యాధులు ప్రభల కుండా దోమల నివారణకు స్ప్రేయింగ్ చేయించడం వంటి కార్యక్ర మాలు చేయినట్లు ఐరాల మండల అభివృద్ధి అధికారి వెంకటేశులు తెలిపారు. ఈకార్యక్ర మంలో మండల పంచాయతీ విస్తరణ అధికారి ఎన్. కుసుమకుమారి, గ్రామ పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని తనవంతు సేవలు అందించారని ఎంపిడిఓ తెలిపారు.

## చిత్తూరు కలెక్టర్‌కు జనసేన నాయకుడి సన్మానం



**కార్వేటి నగరం, మేజర్‌న్యూస్:** చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గంగాధర్ నెల్లూరు నియో జకవర్గ జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యులు యుగంధర్ కలెక్టర్ ఛాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లా డుతూ నియోజకవ ర్గంలో ఉన్న సమస్యలన్నిటిని సర్వరంగ సమగ్ర అభి వృద్ధికి నోచుకోని నియోజకవర్గ అభివృద్ధికి వీలైనంత ఎక్కువ సహక రించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్ర మంలో జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ, నియోజక వర్గ సంయుక్త కార్యదర్శి అన్నామలై, పారసముద్రం మండల ఉపాధ్యక్షులు రాఘవ. జనసేన పార్టీ గంగాధర నెల్లూరు నియోజక వర్గం తరపున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ అసిస్టెంట్

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పచ్చి కాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ అసిస్టెంట్ పట్టుబాల కృష్ణారెడ్డి కోరారు. మండలంలోని తిరుమల య్య పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థుల కు ఆరోగ్యంపట్ల అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల కారణంగా డయేరియా, దోమల వలన జ్వరాలు వ్యాధి చెందే ప్రమాదం ఉందని విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుమారి, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్థానిక శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ సన్మానించిన టీడీపీ నాయకులు



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలో సమస్యలు మీది - పరిష్కారం నాది కార్యక్రమంలో గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్, చిత్తూరు జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ తెలుగు దేశం పార్టీ నాయకులు పుష్పగుచ్చంతో ఘన స్వాగతం పలుకుతున్న ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్ర రైతు కార్యని ర్వాహక కార్యదర్శి మాదిరాజు జనార్దన్ రాజు, మండల పార్టీ ప్రెసిడెంట్ చెంగల్రాయ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, జిల్లా రైతు అధ్యక్షులు నాగేశ్వర రాజు, బీసీ సెల్ నాయకుడు చైర్మన్ రవి యాదవ్ పాల్గొన్నారు.

## అదనపు భవనాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకి వినతి

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరంలో ఉన్న రాజా కుమార స్వామి రాజా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం రెండో సంవత్సరం కళాశాలలో చదువుతున్న దాదాపు 600 మంది పైగా తమ కళాశాలలో చదువుతున్నారని అదనపు భవనం మంజూరు చేయాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప తమ సిబ్బందితో గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ వి ఎస్ థామస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులకు సమాచారా అందించి భవనం మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు.



## సచివాలయం ఆధార్ నమోదు కేంద్రం మార్పు

**నాయుడుపేట మేజర్‌న్యూస్:** పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల పాత అన్నా క్యాంటీన్ భవనమునందు నిర్వహిస్తున్న గరిడి వీధి సచివాలయాన్ని పట్టణంలోని మున్సిపల్ కార్యాల యం ఎదురుగా ఉన్న భవనంలోనికి మార్చడం జరిగిందని కనుక ప్రజలు గమనించాలని నాయుడుపేట మున్సిపల్ కమిష నర్ ఎం జనార్దన్ రెడ్డి కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అతి త్వరలో అన్న క్యాంటీన్లు తెరవబడుతున్న సందర్భంగా అన్న క్యాంటీన్ భవనాన్ని సంసిద్ధం చేయడానికి సచివాలయాన్ని ప్రైవేటు భవనంలోకి మారుస్తున్నామని ఆయన తెలిపారు.



## బాలికల చదువు ఇంటికి వెలుగు



**చిల్లకూరు, మేజర్‌న్యూస్ :** బాలికల చదువు ఇంటికి వెలుగుని ఐసిడిఎస్ ఎసిడిపిఓ జ్యోతి కిరణ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తిప్పగుంటపాళెం గ్రామంలో బేటి బచావ్-బేటి పడావ్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల రక్షణ అందరి బాధ్యతని, వారి చదువుకు ఆటంకాలు కలగించ కుండా అందరూ సహకరించాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంతోపాటు బాలికల చదువుకు వారి చదువుకు అన్ని విధాల ప్రభుత్వం సహకారం ఉంటుదని తెలిపారు. బాలికల్లో ప్రధానంగా వచ్చే రక్త హీనత అని దాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ఫౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భవతులు, కిషోర బాలకలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, ప్రభావతి, సహాయకులు పెంచలమ్మ, సంపూర్ణ పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్లో అధికారులు స్పెషల్ డ్రైవ్

**- 12 మంది అనధికార హాకర్లకు భారీ జరిమానా**

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ :** రైల్వేస్టేషన్‌లో అధికారులు బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టి కార్యకలాపాలను పర్యవేక్షించారు. దీనికోసం కమర్షియల్, ఆపరేటింగ్, ఆర్పిఎఫ్ విభాగాల అధికారులు రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో అనధికారిక హాకింగ్‌కు వ్యతిరేకంగా సంయుక్త డ్రైవ్ నిర్వ హించి, 12 మంది అనధికార హాకర్లను అదుపులోకి తీసుకున్నారు, వీరి ద్వారా రూ. 12,000 జరిమానా విధించి వసూలు చేశారు. అలాగే వారిపై 144 సెక్షన్ కింద కేసులో నమోదు చేశారు. ఈ తనిఖీలు నిరంతరం జరుగుతాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రైల్వే కమర్షియల్ ఇన్స్పెక్టర్, కేటరింగ్ ఇన్‌స్పెక్టర్, టికెట్ చెకింగ్ సిబ్బంది, ఆర్ పి ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.



## బోయకొండలో భక్తుల సౌకర్యాల పరిశీలన



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానంలో భక్తులకు ఏర్పాట్లు, క్యూలైన్ల పరిశీలన, విఐపి దర్శనాల ప్రత్యేక మార్గం, ప్రసాదాల వితరణ లను పరిశీలించిన టిడిపి మండల అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయకొండకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుళకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఈవో ఏకాంబరంను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ రాజు, గిరిరాజు, నాయకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## కడ అధికారిగా వికాస్ మరమ్మత్



**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ గా వికాస్ మరమ్మత్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది. నెల్లూరు కార్పొరేషన్ డెవలప్మెంట్ అథారిటీ అధికారిగా ఉన్న వికాస్ మరమ్మత్‌ను కడ ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించింది. గత నెల 25, 26 తేదీల్లో సీఎం చంద్రబాబు కుప్పం పర్య టన సందర్భంగా కుప్పం ప్రాంత అభివృద్ధి కోసం కడ ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో కడను ఏర్పాటు చేస్తూ ప్రత్యేక అధికారిగా వికాస్ మరమ్మత్‌ను నియమిస్తూ మంగళవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై కుప్పం ప్రాంత అభివృద్ధి కడ ద్వారా సాగనుంది

## పారిశుద్ధ్యంపై అవగాహన

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్యం, మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ల పై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు ఎంపీడీవో అబ్దుల్ రహీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులువారి గ్రామాల్లో ఎప్పటికప్పుడు తాగునీటి ట్యాంకులను శుభ్రపరచాలని అదేవిధంగా ప్రజ లకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో అబ్దుల్ రహీం సూచిం చారు. వర్షాకాలంలో వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నం దున వ్యాధుల నిర్మాణాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించా లని సూచించారు.

## రేషన్ దుకాణం సీజ్



**పెళ్లకూరు మేజర్‌న్యూస్:** మండలంలోని రావులపాడు గ్రామంలో ఉన్న రేషన్ షాప్ నెంబర్ 25 ను బుధవారం సీజ్ చేసినట్లు పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ ఓబయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అందించాల్సిన రేషన్ బియ్యం ప్రజలకు పంపిణీ చేయకుండా ఎలాంటి రికార్డ్ లేకుండా 1065 కేజీ ల బియ్యం తక్కువ రావడంతో తనిఖీ చేసి రేషన్ దుకాణాన్ని సీజ్ చేసి స్థానిక గ్రామ రెవిన్యూ అధికారి కళ్యాణికి అప్పగించడం జరిగిందని వారు తెలిపారు.

## వార్డులు వారిగా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అధికారుల పర్యటన



**కుప్పం, మేజర్‌న్యూస్:** మున్సిపాలిటీ పరిధిలో వార్డుల వారీగా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అధికారులు పర్యటిస్తూ మున్సిపాలిటీ అభివృ ద్ధికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. కుప్పం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్న నేపథ్యంలో గడిచిన నాలుగు రోజులుగా అర్బన్ డెవలప్మెంట్ కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పర్యటిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో వార్డుల వారీగా పర్యటించి సమస్యలను అధ్యయనం చేసుకుంటూ వాటి పరిష్కారానికి అదే విధంగా పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జుమ్ దాము, సోము శేఖర్, హేమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన డైరెక్టర్



**గూడూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠ్య పుస్తక ముద్రణాలయం సంచాలకులు (డైరెక్టర్)రె రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం డివిజన్ పరిధిలోని పాలిచర్లవారిపాళెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అన్ని తరగతులకు పూర్తి స్థాయిలో పుస్తకాలు పంపిణీ కావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు తీసుకు వచ్చేందుకు లక్ష్యంతో కూడిన చదువు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు సంపత్‌కుమార్, రవూఫ్, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బహుజన ఐక్య సదస్సు జయప్రదం చేయండి

**గూడూరు రూరల్ మేజర్‌న్యూస్:** కోట మండలం బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో జులై 17 న కోట షాది మంజిల్ లో జరుగనున్న బహుజన ఐక్యత సభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం గూడూరులోని ప్రైవేట్ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో బహుజన ఐక్యవేదిక నాయకుల ఆధ్వర్యంలో కరపత్రాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేగూరు విజయ్ అంబేద్కర్ మాట్లాడుతూ కారంచేడు మారణ హోమం జరిగి ఈ నెల 17కు 39 ఏళ్ళు పూర్తి చేసుకుంట్నుందనన్నారు. ఈ దాడులను బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఖండిస్తున్నామని తెలిపారు. బహుజన నాయకులు దాసరి సుందరం, రంగనాథ్ లు మాట్లాడుతూ భారత దేశంలో బహుజనులపై దాడులు జరగడం ఆగలేదన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్య వేదిక నాయకులు, వేగూరు విజయ్ అంబేద్కర్, రవి రాఘవేంద్ర, మాకాని వెంకటేశ్వర్లు, దాసరి సుందరం, మీజూరు మాధవ్, బి.రంగనాథ్, దేశయ్య, పోలయ్య పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై పజలకు అవగాహన

**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** మండలంలోని గుండెలు గుంట గ్రామపంచాయతీ ఎస్టీ కాలనీలో అధికారులు సందర్శించారు .ఆర్డబ్ల్యూఎస్ ఈఈ విజయ్ కుమార్ , ఆర్డబ్ల్యూఎస్ డిఈ. ఎంపిడిఓ, ఈఓ ఆర్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, మెడికల్ ఆఫీసర్ కాసరం పిహెచ్ సి ,మొదలైన అధికారులందరూ గుండెలిగుంట ఎస్టీ కాలనీ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి పైపులైనులను పరిశీలించారు. డైరెక్ట్ పంపింగ్ సిస్టం ద్వారా నీరు అందిస్తున్న ప్రాంతాలలో కూడా క్లోరినేషన్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కాలనీ మధ్యలో ఉన్న వేప చెట్టు ఎండిపోవడంపై గ్రామస్తులలో ఉన్న అపోహలను ఈ సందర్భంగా అధికారులు నివృత్తి చేశారు. గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. గ్రామంలో రెండు చోట్ల ఉన్న పైప్ లైన్ లీకేజీ ప్రాంతాలను గుర్తించి సక్రమంగా వాటిని మూసి వేయించారు. గ్రామంలో నీరు తాగుటకు అనుకూలంగా ఉన్నదని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తెలియజేశారు. మెడికల్ ఆఫీసర్ వారి సిబ్బందితో కలిసి ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య అవగాహన కల్పించారు. గ్రామంలో డయేరియా లక్షణాలు ఎవరికి లేవని ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ తెలియజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీరు త్రాగాలని సూచించారు. గ్రామపంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



# ధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి**

**దేవస్థానం ఈఓ మూర్తి**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధమైన ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం నిర్వహించే వార్షిక తిరునాళ్ళు అత్యంత వైభవంగా ఈనెల 12వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహింపబడుతున్నాయి. నేడు శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం దక్షిణామూర్తి సన్నిధి వద్ద దేవస్థానం ఈఓ మూర్తి ఆధ్వర్యంలో ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామివార్షిక తిరునాళ్ళు గోడపత్రికల ఆవిష్కరణ శాస్త్రక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొని గోడపత్రికల ఆవిష్కరణ చేశారు.



ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం అనుబంధమైన ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి ఆలయంలో ప్రతిఏటా నిర్వహించే వార్షిక తిరునాళ్ళు ఈ పర్యాయం అత్యంత వైభవంగా నిర్వహించడానికి పూర్తి కార్యాచరణ చేపట్టామని, ఈ తిరునాళ్లలో భక్తులకు ఎక్కడ ఎటు వంటి ఇబ్బందులు జరగ కుండా స్వామివారి దర్శనం శ్రీఘ్రంగా అయ్యేవిధంగా కార్యాచరణ చేపట్టామని, అగ్నిగుండా మహోత్సవం నాడు మహిళలకు, పురుషులకు వేరు వేరుగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి, ఎక్కడ తోపులట జరగకుండా అగ్నిగుంట మహోత్సవం జరిగే విధంగా పోలీస్ యంత్రాంగంతో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నామని, ప్రశాంతపు వాతావరణంలో తిరణాలు నిర్వహించే విధంగా కార్యాచరణ చేపడుతున్నమని తెలియజేశారు. శ్రీకాళహస్తి దేవస్థానం ఆదాయం పెంచేలా దాతలను ఆహ్వానిస్తున్నామని, వచ్చిన దాతలకు గోల్డ్ కార్డు ఏంట్రీతో ఉచిత రాహు కేతు పూజ, ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు నిర్వహించే విధంగా కార్యాచరణ చేపడుతుందని తెలియజేశారు.



## అంగరంగ వైభవంగా గూడూరు ఎమ్మెల్యేకు

# అభిమాన నీరాజనం

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** అసెంబ్లీ ఎన్నికల్లో రెండోసారి అఖండ మెజారిటీతో విజయం సాధించిన గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశింసునీల్ కుమార్ బుధవారం మొట్టమొదటి సారిగా చిట్టమూరుకు విచ్చేశారు. తేదేపా చిట్టమూరు మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు. స్థానిక గణపర్తి అన్నయ్య (సుబ్రహ్మణ్యం) నాయుడు స్మారక వనం నుండి పెద్ద ఎత్తున తరలి వచ్చిన పార్టీ శ్రేణులతో విజయోత్సవ ర్యాలీని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గుర్రాల బండిపై సునీల్ కుమార్ అధిరోహించగా తప్పెట్లు, తాళాలు, డీజే, పెద్ద ఎత్తున నిర్వహించిన బాణాసంచా వేడుకల నడుమ ర్యాలీ సాగగా, అడుగడుగునా బ్రహ్మరథం పట్టి, నీరాజనం పలికారు. కిలోమీటర్ మేర పుష్పాలతో స్వాగతం పలికి, గజమాలలతో సత్కరించగా, మహిళలు హారతులు పట్టారు.పార్టీ కార్యాలయంకు చేరుకుని, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ కార్యాలయాన్ని పున్నః ప్రారంభించారు. తనకు మద్దతుగా నిలిచి, గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని అవివాదం చేస్తూ అభివృద్ధే అజెండాగా, అందరికీ అందుబాటులో ఉండి పని చేస్తామన్నారు. విజయోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన తమ్ముళ్లు ఉత్సాహంగా పాల్గొని సంబురాల్లో తేలిపోయారు. ఊరూ వాడ కదలిరాగా తమ్ముళ్ల ఉరకలేసిన ఉత్సాహంతో విజయోత్సవ సంబురం మిన్నంటింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యురాలు దువ్వూరు భారతమ్మ,తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కామిరెడ్డి సునీల్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు రైతు అధికార ప్రతినిధి మారంరెడ్డి జనార్దన్ రెడ్డి, తెదేపా బీసీసెల్ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి గుండు బోయిన కస్తూరయ్య యాదవ్, తిరుపతి పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు, అరవపాలెం సర్పంచ్ నల్లారెడ్డి రాజేష్ రెడ్డి, నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్ బసివిరెడ్డి కృష్ణారెడ్డి, పార్టీ మండల కార్యదర్శి ఆరూరు గిరిబాబు నాయుడు, సీనియర్ నాయకులు వెదనపర్తి రాజగోపాల్ రెడ్డి, దువ్వూరు మస్తాన్‌రెడ్డి, కోటి సుబ్రహ్మణ్యం, హరినాద్, పవన్‌లతో పాటు ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.





# తప్పిన పెను ప్రమాదం

**అదుపు తప్పిన వి.కోట నారాయణ స్కూల్ బస్సు**

**బస్సు బయలుదేరినప్పుడు బ్రేకులు సరిగా లేవని విద్యార్థులకు చెప్పిన డ్రైవర్**

**నక్కనపల్లి గ్రామం వద్ద మరో బస్సును అధిగమించే క్రమంలో పక్కకు వాలిన బస్సు**

**సుమారు 30 మంది విద్యార్థులుతో బయలుదేరిన స్కూల్ బస్సు**

**నారాయణ స్కూల్ బస్సులను పరీక్షించడంలో రవాణాశాఖ అధికారుల వైఫల్యం**

**మంత్రి పాఠశాల బస్సులంటూ పట్టించుకోని రవాణా శాఖ అధికారులు**




**వి.కోట, మేజర్‌న్యూస్:** చిత్తూరు జిల్లా వి.కోట నారాయణ పాఠశాలకు సంబంధించిన స్కూల్ బస్సు బయలుదేరే ముందు బ్రేకులు సరిగా లేవని విద్యార్థులకు చెప్పిన డ్రైవర్ నిర్లక్ష్యంతో వ్యవహరించడంతో ఈ ప్రమాదం సంభవించింది. విద్యార్థులను స్కూల్ నుండి సురక్షితంగా వాళ్లు గమ్య స్థలానికి సురక్షితంగా తీసుకొని వెళ్లవలసిన బాధ్యత స్కూల్ బస్ డ్రైవర్ ది అదేమీ పట్టించుకోకుండా బ్రేకు సమస్య ఉన్నా కూడా పిల్లలని ఎక్కించుకొని వెళ్లడం పిల్లలతో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం మంచిది కాదు.నక్కనపల్లి గ్రామం వద్ద మరో బస్సును అధికమించే క్రమంలో పక్కకు వాలిన బస్సు సుమారు 30 మంది విద్యార్థులుతో బయలుదేరిన బస్సు నారాయణ స్కూల్ బస్సులను పరీక్షించడంలో రవాణాశాఖ అధికారుల వైఫల్యం చెందారు.

పాఠశాల బస్సులను పాఠశాల ప్రారంభంకు ముందు బస్సుని తనిఖీ చేసి బస్సుని రవాణా శాఖ ఎఫ్‌సి చేసిన తర్వాత అన్ని సక్రమంగా ఉన్నాయో లేదా తేల్చే బాధ్యత రవాణా శాఖ అధికారులు ఇవి ఏమి పట్టించుకోకుండా ప్రైవేటు పాఠశాలల యాజ మాన్యం ఇస్తున్న మామూళ్లకు అలవాటపడి చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న రవాణా శాఖ ఎఫ్‌సి చేసే ముందు ఆర్టీవో స్కూల్ బస్సుకు, బ్రేకు, హ్యాండ్ బ్రేకు, పొల్యూషన్ సర్టిఫికెట్, టైర్లు, లైట్లు, అద్దం శుభ్రపరిచే వైఫర్, ఇంజన్ కండిషన్, స్పీట్ గవర్నర్, డ్రైవర్ హెవీ లైసెన్స్, డ్రైవర్‌కు కంటి చూపు, షుగర్ బిపి, పరీక్షలన్నీ పరిశీలించిన తర్వాతే స్కూల్ బస్సులకు ఆర్టీవో ఎఫ్‌సి చేసి పర్మిట్ ఇవ్వాలి ఇవేమీ చూసి చూడనట్టుగా వ్యవహరించి ఇష్టం సారం స్కూల్ బస్సులకు ఎఫ్ సి పర్మిట్లు ఇచ్చేస్తున్న ఆర్టీఓ అధికారులు. పిల్లలకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. తల్లి దండ్రులు తమ పిల్లలని ఉన్నత చదువులు చదివించాలని భవిష్యత్తులో మంచి మార్గాన పంపించాలని తల్లిదండ్రులు ఎన్నో కలలు కంటూ ఉంటారు. ఇవన్నీ పట్టించుకోకుండా ఇటువంటి ప్రమాదంలో పిల్లలకు ఏమైనా అయితే మా పిల్లలు, మా జీవితాలు నాశనం అవుతాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రవాణా శాఖ ఆర్టీఓ అధికారులు మండలంలోనిఅన్ని ప్రైవేటు పాఠశాలల స్కూల్ బస్సులను మరొకసారి పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నాయో లేదా అని తేల్చాల్సిన బాధ్యత రవాణా శాఖ పైన ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



జనం కోసమే

సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు

నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232

ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116